
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

సిద్దిపేట

శుక్రవారం 29 నవంబరు 2024

గౌరారం ఘుమఘుమా



● రెస్టారెంట్లు, టిఫిన్‌లు, స్నాక్స్‌కు కేరాఫ్ ● ఆరు జిల్లాల వాహనదారులకు అడ్డా
● సాయంత్రమైందంటే చాలు జనసందోహం ● వాహనాలకు పార్కింగ్ దొరకని పరిస్థితి

7లో..

ప్రయాణం మధ్యలో ఏమైనా తినాలనిపిస్తుందా.. లేదా కాసేపు ఆగి అలా స్నాక్స్ తిని టీ తాగుదామనుకుంటున్నారా.. అయితే రాజీవ్ రహదారి వెంట ఉన్న గౌరారం వద్ద ఆగాల్సిందే. దారెంట వెళుతున్నప్పుడు రోడ్డు పక్కనే ఉన్న ఇక్కడి రెస్టారెంట్లు, టిఫిన్, స్నాక్స్ సెంటర్లు ఘుమఘుమలాడే రుచులతో రా రా రమ్మని పిలుస్తుంటాయి.



షరా మామూళ్లే

సిద్దిపేట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అక్రమ వసూళ్లు

- కొత్త అధికారులు వచ్చినా మారని తీరు
- పనికావాలంటే పైసలివ్వాల్సిందే
- డాక్యుమెంట్ రైటర్లతో కుమ్మక్కు!

సిద్దిపేట క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అధికారులు మారినా వసూళ్ల పర్వం ఆగడం లేదు. దీంతో ఏసీబీ అధికారులు ఈ కార్యాలయంపై నజర్ పెట్టినట్లు తెలుస్తోంది. ఆరు నెలల క్రితం ఇక్కడి అధికారులు, సిబ్బంది బదిలీకాగా, వారి స్థానంలో వచ్చిన కొత్తవారు వచ్చారు. కొద్ది రోజులు బాగానే ఉన్నా... అనంతరం షరా మామూలే అన్నట్లుగా వసూళ్లకు పాల్పడుతున్నారు. గతంలో ఏసీబీ దాడులు జరగడంతోపాటు ఓ అధికారి అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయ్యారు. అనంతరం వచ్చిన మరో అధికారి రిజిస్ట్రేషన్లకు మరింత ఎక్కువ తీసుకున్నారనే ఆరోపణలున్నాయి.



సిద్దిపేట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు

ప్రస్తుత అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే వాదనలున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2020 నుంచి డీటీపీటీసీ లేఅవుట్ వెంచర్లలోని ప్లాట్లకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేయాలి. కానీ సిద్దిపేటలో మాత్రం వ్యవసాయ భూమిని నేరుగా నాలా పర్మిషన్ తీసుకొని చేసిన వెంచర్‌లో కూడా అధికారులు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా పరిసర ప్రాంతాల్లో మూడు నుంచి నాలుగు మాత్రమే డీటీపీటీసీ లేఅవుట్లు ఉన్నాయి. మిగతా అన్నీ వెంచర్లు నాన్ అథరైజ్డ్ వెంచర్లే. అధికారులు డబ్బులు తీసుకుని ఇందులో రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు తెలుస్తుంది.

డాక్యుమెంట్ రైటర్లతో కలిసి..

సాధారణంగా ప్రాపర్టీ, ప్లాట్లు అయినా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి మొదట డాక్యుమెంట్ రైటర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. అక్కడ వారు పత్రాలు సెట్ చేసి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తీసుకువెళ్తారు. తరువాత అధికారులు డాక్యుమెంట్ రైటర్ తో ఒక్క డాక్యుమెంట్‌కు ఇంత ఇవ్వాలని బేరం మాట్లాడుకుంటారు. ప్రతిరోజూ సాయంత్రం ఒక్కొక్క డాక్యుమెంట్ రైటర్ ఎన్ని డాక్యుమెంటులు రెడీ చేశాడో.. వాటన్నింటికి డబ్బులు అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ అక్రమ మసూళ్లకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.



నాడు రంగధాంపల్లి చౌరస్తా వద్ద హరీశ్‌రావు, ఉద్యమకారులను అరెస్ట్ చేసేందుకు చుట్టుముట్టిన పోలీసులు

నినాదానికి ఊపిరి

రంగధాంపల్లిలో దీక్షకు ఏర్పాట్లు

వస్తుండగానే కేసీఆర్ అరెస్ట్

నేటికి సరిగ్గా 15 ఏళ్లు

నేడు దీక్షా దివాస్

వేడుకలకు బీఆర్ఎస్ ఏర్పాట్లు

సిద్దిపేట టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో సిద్దిపేటది ప్రత్యేక స్థానం. మలి దశ ఉద్యమాన్ని మలుపు తిప్పిన ఘటనలో కీలకంగా మారింది అప్పటి ఉద్యమ నేత కేసీఆర్ తలపెట్టిన దీక్ష. ఉమ్మడి రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలలో అన్యాయం జరుగుతున్నదని, ప్రత్యేక రాష్ట్ర సాధనతోనే న్యాయం జరుగుతుందని, తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అని అప్పటి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిద్దిపేటలో రంగధాంపల్లిలో ఆమరణదీక్ష చేయాలని నిర్ణయించారు. దీక్ష కోసం కరీంనగర్ నుంచి కేసీఆర్ బయలుదేరడం.. ఆయన అరెస్టు, ఆమరణ దీక్ష దిగడంతో మలి దశ ఉద్యమం మరింత ఊపందుకుంది. నాడు కేసీఆర్ అరెస్ట్‌తో రంగధాంపల్లి వద్ద యుద్ధవాతావరణం నెలకొంది. ఓ వైపు పోలీసులు, మరో వైపు ఉద్యమకారుల నినాదాలు హోరెత్తాయి. కేసీఆర్ అరెస్ట్‌తో హరీశ్‌రావు దీక్షలో కూర్చుకున్నారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత రామలింగారెడ్డి, పద్మా దేవేందర్‌రెడ్డిలు దీక్షలో పాలుపంచుకున్నారు. ఈ క్రమంలోనే దీక్ష స్థలిని పోలీసులు చుట్టుముట్టి హరీశ్‌రావుతో సహా ముఖ్య నాయకులందరిని అరెస్ట్ చేసి పలు ప్రాంతాలకు తరలించారు.



దీక్షలో ఎమ్మెల్యే హరీశ్‌రావు (ఫైల్)

-మిగతా 8వ పేజీలో..

పుట్టిన రోజే.. అంతిమ రోజై..

● విద్యుదాఘాతంతో బాలిక మృతి

చేర్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పుట్టినరోజే ఆ బాలికకు అంతిమదినమైంది. విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నాగపురి గ్రామానికి చెందిన మజ్జిగ లావణ్య-నర్సింహుల పెద్ద కుమార్తె కావ్య(16) గత సంవత్సరంలో పదవతరగతి పూర్తిచేసింది. పేద కుటుంబం కావడంతో ఇంటి వద్దే ఉంటూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా వ్యవసాయ, ఇంటిపనులు చేస్తూ తోబుట్టువులకు అండగా నిలిచింది. గురువారం తన పుట్టినరోజు కావడంతో దేవాలయానికి వెళ్లేందుకు తెల్ల వారుజామునే నిద్రలేచింది. ఇంటి ఆవరణలోని నల్లా సంపులో నుంచి నీటిని పట్టేందుకు బోరుమోటార్ ఆన్ చేసిన తరువాత విద్యుత్ వైరును సరిచేస్తున్న క్రమంలో షాక్‌కు గురై కిందపడి విలవిలలాడింది. కావ్యను కాపాడే ప్రయత్నంలో ఆమె చెల్లెలికి స్వల్పంగా షాక్ తగిలింది. అరుపులు పెట్టడంతో కుటుంబసభ్యులు వచ్చి చూసే సరికి కావ్య విగతజీవిగా మారింది. వెంటనే చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, కావ్య చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. ఆమె చెల్లెలు కోలుకుంది. కొమురవెల్లి ఎస్‌ఐ రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కావ్య (ఫైల్)

కోహెడ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నిర్మల

● వైస్ చైర్మన్‌గా తిరుపతిరెడ్డి



చైర్‌పర్సన్ నిర్మల



వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి

కోహెడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కోహెడ మండల వ్యవసాయ మార్కెట్‌కు నూతన కమిటీని ఏర్పాటు చేస్తూ బుధవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 16 మందితో కమిటీని నియమించింది. చైర్ పర్సన్‌గా మండలంలోని వరుకోలు గ్రామ మాజీ ఎంపీటీసీ బోయిని నిర్మలాజయరాజు, వైస్ చైర్మన్‌గా చెంచలచేర్యుపల్లికి చెందిన భీమిరెడ్డి తిరుపతిరెడ్డి నియమితులయ్యారు. డైరెక్టర్లుగా మహమ్మద్ అంకుష్, చింతలపల్లి జనార్దన్‌రెడ్డి, మౌటం విజయ, దూలం శ్రీనివాస్, చామంతుల శ్రీధర్, యాదగిరి, సుంకరి సారయ్య పులి రాజు, చేపూరి శ్రీశైలం, గాదాసు రాజేందర్ నియామకమయ్యారు. అలాగే ప్యాక్స్ చైర్మన్, ఏడీఏ, జిల్లా మార్కెటింగ్ అధికారి, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిని సభ్యులుగా నియమించింది. ఈ సందర్భంగా బోయిని నిర్మల మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు.

ఫైళ్ల మాయంపై కమిషనర్ ఆరా..!

చేర్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో పలు ఫైళ్ల మాయం విషయంపై దేవాదాయశాఖ కమిషనర్ ఆరా తీసినట్లు తెలిసింది. గతంలో చేసిన ఫైనాన్స్ ఆడిట్ విచారణ, రికవరీ ఆదేశాల వివరాలు పంపించాలని ఆయన కోరినట్లు సమాచారం. ఈ మేరకు ఆలయాధికారులు గురువారం అందుబాటులో ఉన్న నివేదిక ప్రతులను పంపించారు. తద్వారా విచారణాధికారిని నియమిస్తారా... గత ఉత్తర్వులానుసారం రికవరీకి చర్యలు తీసుకుంటారా అనేది ఆసక్తికరంగా మారింది. 2014-15, 2015-16, 2016-17ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన లావాదేవీలలో జరిగిన అవకతవకలను గుర్తించి ఆడిటర్ అందించిన నివేదికానుసారం 2018లోనే రికవరీకి ఆదేశించినప్పటికీ ఆరేళ్లపాటు నిర్లక్ష్యం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై అప్పట్లోనే 'ఆంధ్రజ్యోతి' మల్లన్న సన్నిధిలో మాయగాళ్లు.., ఫైనాన్స్ ఆడిట్ కథ కంచికేనా.. అనే శీర్షికలతో కథనాలు ప్రచురితం చేయడంతో 2018 జూలై నెలలో మెమోలు జారీ చేశారు. కానీ ప్రత్యామ్నాయ చర్యలు వెంటనే చేపట్టకపోవడంతో అది అటకెక్కింది. తాజా పరిణామాలతో రికార్డులు అందుబాటులో లేకపోవడం వలన ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ప్రస్తుత కమిషనర్ ఆదేశానుసారం మరోమారు విచారణలో అవకతవకలు తేటతెల్లమైతే నిధులు రికవరీ చేస్తారా.. లేదా అప్పటి నుంచి పనిచేసిన ఈవోలతో పాటు సంబంధిత విభాగాల ఇన్‌చార్జిలపై చర్యలకు ఉపక్రమిస్తారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా, 2017-18 నుంచి ప్రస్తుత ఆర్థికసంవత్సరం వరకు ఎందుకు ఆడిట్ నిర్వహించలేదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికే ఆలయ పాలన గాడితప్పడం, మరికొద్దిరోజుల్లో బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానుండటంతో ఉన్నతాధికారులు తీసుకునే నిర్ణయంపై అందరిదృష్టి మళ్లింది.

10 జీవాలు హతం

చిన్నకోడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని జంతువు దాడిలో 10 జీవాలు మృతి చెందిన సంఘటన చిన్నకోడూరు మండలం మాచాపూర్ గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు ఆసర్ల కొమురయ్య నిత్యం వ్యవసాయ బావుల వద్ద ఇనుప జాలి పెన్సింగ్‌లో మంద ఆపుతున్నాడు. బుధవారం సాయంత్రం కూడా పెన్సింగ్ లోపలికి గొర్రెలను తోలి ఇంటికి వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున కొమురయ్య వచ్చి చూసేసరికి 10 గొర్రెలు మృతి చెంది కనిపించడంతో బోరున విలపించాడు. వీటి విలువ సుమారు రూ. 80 వేల వరకు ఉంటుందని పశువైద్యాధికారిణి మంజుల తెలిపారు. గుర్తుతెలియని జంతువు మందపై దాడి చేసిందని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ తెలిపారు. హైనానే దాడి చేసి ఉండొచ్చని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



పార్టీలకతీతంగా ప్రగతికి కృషి చేద్దాం

- హుస్నాబాద్‌లో సమగ్ర డ్రైనేజీ నిర్మాణానికి ప్రణాళికలు
- డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సు ఏర్పాటుకు కృషి
- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధికి పార్టీలకతీతంగా అందరం కలిసి పనిచేద్దామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం హుస్నాబాద్ మున్సిపల్ నూతన కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం ప్రజాసమస్యల పరిష్కారానికి వేదిక కావాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఈ మున్సిపల్ కార్యాలయానికి మాజీ ఎమ్మెల్యే దివంగత బొప్పరాజు లక్ష్మీకాంతారావు పేరు పెట్టే విషయాన్ని పాలకవర్గం ఆలోచించాలన్నారు. హుస్నాబాద్ పట్టణంలో సమగ్ర డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి ప్రణాళికలు చేస్తున్నామని, ఇందుకు రూ. 10 కోట్లు వెచ్చించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సు ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. స్థానిక ప్రభుత్వ వంద పడకల అసుపత్రికి మరో 150 పడకలు మంజూరు చేశామన్నారు. అనంతరం నూతన సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశ ప్రాంగణం వద్ద పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ మను చౌదరి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చెర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆర్డీవో రామ్మూర్తి, వైస్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, కమిషనర్ మల్లికార్జున్, మాజీ ఛైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్లు కొంకటి నళినిదేవి, బోజు రమాదేవి, కోమటి స్వర్ణలత, పెరుక భాగ్యరెడ్డి, శ్రీనివాస్, దొడ్డి శ్రీనివాస్, గోవిందు రవి, చిత్తారి పద్మ, గూళ్ళ రాజు, జనగామ రత్న, రాజు, లావణ్య, వాల సుప్రజ, సరోజన, అయిలేని శంకర్ రెడ్డి, అయూబ్, లలిత పాల్గొన్నారు.



హుస్నాబాద్ మున్సిపల్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం, కలెక్టర్ మను చౌదరి

వైజ్ఞానిక వేడుక షురూ

● ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, 52వ బాలల వైజ్ఞానిక ప్రదర్శన వేడుక అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. దీనికి పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల (డా. ఏపీజే అబుల్ కలాం ప్రాంగణం) వేదికకాగా, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎస్సీ కమిషన్ చెర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ప్రారంభించారు. వివిధ స్టాల్స్‌ను వారు సందర్శించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో 1500 ప్రాజెక్ట్‌లుంటే ఈసారి 1733 ప్రాజెక్టులున్నాయన్నారు. కాలుష్య నివారణ, నియంత్రణ అంశాలపై పరిశోధనలు జరగాల్సిన అవసముందని అభిప్రాయపడ్డారు. నీటి ఆదా, ప్రకృతి రక్షణ, వ్యవసాయరంగంలో వినూత్న కార్యక్రమాలపై దృష్టిపెట్టాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి కల్లెపల్లి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్నాల ధరలు హై..

- క్వింటాలు వడ్లకు రూ. 2,800, బియ్యం రూ. 5,500
- మద్దతు ధర కంటే రూ. 500 ఎక్కువ చెల్లిస్తున్న వ్యాపారులు
- మరాడించి బియ్యం విక్రయిస్తున్న మరికొంతమంది రైతులు

కొనుగోలు కేంద్రాలకు నై ● ఇప్పటి వరకు వచ్చింది 13వేల మెట్రిక్ టన్నులే

మెదక్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బోనస్ ఇస్తామన్నా సన్న వడ్లు కొనుగోలు కేంద్రాలకు రావడం లేదు. బియ్యానికి డిమాండ్ విపరీతంగా ఉండడంతో రైతులు ధాన్యాన్ని విక్రయించడానికి ముందుకురావడంలేదు. మెదక్ జిల్లాలో అధికంగా బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్, ఆమని, సూపర్ ఆమని తదితర సన్నరకాలను సాగు చేస్తారు. ఈసారి సన్నాల సాగు పెరగడం, ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో జిల్లావ్యాప్తంగా 1.20 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం వడ్లు సేకరించాలని పౌర సరఫరాలశాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ఇప్పటి వరకు కేంద్రాలకు 13వే మెట్రిక్ టన్నుల సన్న వడ్లు మాత్రమే వచ్చాయి. రైతులు సన్న రకాలను కేంద్రాల్లో విక్రయించేందుకు మొగ్గుచూపడంలేదు.

వ్యాపారుల జోరు

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ మందకొడిగా సాగుతోంది. కాంటా పెట్టడానికి హమాలీ చార్జీలు రైతులే చెల్లించాల్సి వస్తున్నది. డబ్బుల చెల్లింపులోనూ జాప్యం జరుగుతున్నది. దీంతో రైతులు సన్న వడ్లను మార్కెట్‌లో విక్రయించేందుకే మొగ్గుచూపుతున్నారు. సన్నాలకు కేంద్రం రూ.2,320 మద్దతు ధర ప్రకటించింది. సన్నరకం ధాన్యం ధర మెదక్ జిల్లా పరిధిలోని మిల్లుల్లో క్వింటాలుకు రూ2,800 వరకు ఉన్నది. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే రూ.450 ఎక్కువ లభిస్తుండడంతో రైతులు సన్న వడ్లను బహిరంగ మార్కెట్‌లో విక్రయించడానికే మొగ్గు చూపుతున్నారు. దళారులు నేరుల కల్లాల వద్దకే వెళ్లి సన్న వడ్లను కొనుగోలు చేస్తున్నారు. వెంటనే రైతుకు డబ్బు ఇస్తున్నారు. హమాలీల చార్జీలు కూడా వారే చెల్లిస్తున్నారు. దీంతో, కొనుగోలు కేంద్రాల్లో సన్న వడ్ల సేకరణ లక్ష్యం 50 కూడా మించదేమోనని అధికారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

వడ్లు అమ్మేందుకు ససేమిరా..

మరోవైపు కొందరు రైతులు సన్నవడ్లను స్వయంగా మర పట్టించి బియ్యం విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో సన్నబియ్యం కొత్తవి క్వింటాలుకు రూ. 5,500 విక్రయిస్తున్నారు. తమకు పరిచయం ఉన్న వ్యక్తులే రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తున్నారు. ఇందుకోసం వరి కోతలు పూర్తవగానే రైతులను సంప్రదిస్తున్నారు. ముందుగా చెప్పినవారికి కొందరు రైతులు డోర్ డెలివరీ చేస్తున్నారు. మరోవైపు తమిళనాడుకు కూడా మన బియ్యం భారీగా ఎగుమతి చేస్తున్నారని వ్యాపారులు పేర్కొంటున్నారు.



మహిళలకు మగ్గ వర్క్‌లో ఉచిత శిక్షణ

● ఎస్‌బీఆర్‌ఎస్ఈటిఐ డైరెక్టర్ రాజేంద్ర ప్రసాద్

సంగారెడ్డి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం (ఎస్‌బీఆర్‌ఎస్ఈటీఐ) డైరెక్టర్ రాజేంద్ర ప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన వారై 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల లోపు ఉన్నవారు అర్హులన్నారు. మహిళలు దరఖాస్తు ఫారంతో పాటు రేషన్‌కార్డు జిరాక్స్, ఆధార్‌కార్డు, పదో తరగతి మెమో, ఫొటోలు, బ్యాంక్ ఖాతా బుక్ జిరాక్సు ప్రతులు జతచేయాలని సూచించారు. ఎంపికైనవారికి ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. పూర్తి సమాచారం కోసం 9704446956, 9490129839 నంబర్లలో సంప్రదించాలని రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

'ఉపాధ్యాయులను మధ్యాహ్న భోజన పనుల నుంచి మినహాయించాలి'



మాట్లాడుతున్న ఎల్లం

మెదక్ అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను మధ్యాహ్న భోజన పనుల నుంచి మినహాయించాలని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎల్లం, చల్లా లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సంఘ భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు వాస్తవ ధరలకు అనుగుణంగా వంట చార్జీలు ఇవ్వాలన్నారు. పాఠశాలలో వంట నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని, ప్రభుత్వం నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షులు మాధవరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం అవసరం

● మెదక్ డీఈవో రాధాకిషన్

మెదక్ అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మూఢ విశ్వాసాలను నమ్మొద్దని, శాస్త్ర విజ్ఞానాన్ని పెంచుకోవాలని డీఈవో రాధాకిషన్ సూచించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర పాఠశాలలో చెకుముఖి జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు చెకుముఖి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియంలో జడ్పీహెచ్ఎస్(రాజ్‌పల్లి), తెలుగు మీడియంలో జడ్పీహెచ్ఎస్(మాచవరం), ప్రైవేటు ఇంగ్లీష్ విభాగంలో వివేకానంద పబ్లిక్ స్కూల్(రామాయంపేట) ప్రథమస్థానంలో నిలిచాయి. వీరికి డీఈవో, అధికారులు ధ్రువపత్రాలు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మోహన్ రావు, దేవుల్లా, హెచ్ఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు. జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో రామాయంపేటలోని వివేకానంద విద్యార్థులు ఆర్. విష్ణు, సిరివదన, సారిక ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి



మెదక్ అర్బన్: విజేతలకు బహుమతి అందజేస్తున్న డీఈవో రాధాకిషన్



సంగారెడ్డి అర్బన్: రాష్ట్రస్థాయికి ఎంపికైన ఎద్దుమైలారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

సైన్స్ టాలెంట్ టెస్ట్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని జడ్పీ హాల్‌లో గురువారం చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జడ్పీ సీఈవో జానకీరెడ్డి పరీక్ష పేపర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, సంగారెడ్డి, కంది మండలాల ఎంఈవోలు మాట్లాడారు. పోటీల్లో కంది మండలం ఎద్దుమైలారం జడ్పీహెచ్ఎస్, కొండాపూర్ మండలం అనంతసాగర్ ప్రాథమికోన్నత పాఠశాల, కందిలోని మైనారిటీ గురుకుల పాఠశాల, విద్యానగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరు వచ్చేనెల 14 నుంచి 16వ తేదీవరకు ఆదిలాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి చెకుముకి పోటీల్లో పాల్గొంటారని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గైని బాలయ్య తెలిపారు. అనంతరం విజేతలకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ ప్రధాన కార్యదర్శి సాయితేజ, రాష్ట్ర కార్యదర్శి ప్రతాప్, జిల్లా కోశాధికారి ప్రశాంత్, గౌరవ అధ్యక్షుడు జాన్‌పాల్, మహేశ్‌చారి పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

సంగారెడ్డి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో స్కోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా నేరమన్నారు. డీసీపీవో రత్నం, డీఐఈవో గోవిందరామ్, సఖి అడ్మినిస్ట్రేటర్ కల్పన, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ యాదగిరి, స్కోప్ జిల్లా సమన్వయకర్త మాణయ్య మాట్లాడారు.

అంగన్‌వాడీల ఆధ్వర్యంలో వనభోజనాలు

శివ్వంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా మండల కేంద్రమైన శివ్వంపేటలో అంగన్‌వాడీ కేంద్రం ఒకటి, రెండు, మూడు సెంటర్ల పిల్లలతో వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మండల సూపర్‌వైజర్ సంతోష హాజరయ్యారు. పిల్లలతో పల్లె ప్రకృతివనాన్ని సందర్శించి దుర్గమ్మ ఆలయం వద్ద వన భోజనాలు చేయడం జరిగిందని అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి తెలిపారు.

ఎంపీ సురేష్ షెట్కార్‌ను అభినందించిన రాహుల్



నారాయణఖేడ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌ను ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ అభినందించారు. మహారాష్ట్రలోని నాందేడ్ పార్లమెంట్ స్థానానికి ఇటీవల జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఇన్‌చార్జిగా సురేష్ షెట్కార్ వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బలవంతరావు రవీందర్ చౌహాన్ ఎన్నికయ్యారు. గురువారం ప్రియాంక గాంధీ, బలవంతరావు రవీందర్‌చౌహాన్ పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పార్లమెంట్ ఆవరణలో చౌహాన్ విజయంలో కీలకపాత్ర పోషించారంటూ షెట్కార్‌ను రాహుల్ గాంధీ అభినందించారు.

నల్లవాగు ఎత్తిపోతలకు గ్రీన్ సిగ్నల్

రూ.73.70 కోట్ల పనులకు పరిపాలన అనుమతులు

కల్హేర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఏకైక మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టుపై ఎత్తిపోతలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ మేరకు రూ. 73.70 కోట్ల పనులకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో పరిపాలన అనుమతులు ఇచ్చినట్లు నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి. సంజీవరావు తెలిపారు. మంజీరా నది నుంచి నల్లవాగుకు నీటిని ఎత్తిపోసేందుకు తాను రూ. 90 కోట్లతో ప్రతిపాదనలు ఇవ్వగా, మంత్రి రూ.73.70 కోట్లకు ఆమోదం తెలిపారని అన్నారు. నల్లవాగు ప్రాజెక్టుకు భారీ వరద ఇన్‌ఫ్లోగా వస్తున్నప్పటికీ ప్రాజెక్టులో 40 శాతం పూడిక ఉన్నందున నీటినిల్వ అధికంగా ఉండటం లేదని, పూడిక తొలిగింపుతో పాటు, కుడి, ఎడమ కాలువల మరమ్మత్తులకుగానూ తాను మంత్రికి ప్రతిపాదనలు పంపగా, మొదటి విడతలో కాలువల మరమ్మత్తు పనులకు ఆమోదం తెలుపడంతో పాటు సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారన్నారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహలకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి దన్యవాదములు తెలిపారు.



రాజీవ్ రహదారి పక్కన గౌరారం వద్ద హోటళ్లు, రెస్టారెంట్లు

గౌరారం ఘుమఘుమా

రెస్టారెంట్లు, టిఫిన్‌లు, స్నాక్స్‌కు కేరాఫ్.. ఆరు జిల్లాల వాహనదారులకు అడ్డా

- సాయంత్రమైందంటే చాలు జనసందోహం
- వాహనాలకు పార్కింగ్ దొరకని పరిస్థితి

వర్గల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని గౌరారం ప్రాంతం ఫుడ్‌స్పాట్‌గా మారింది. సిద్దిపేట నుంచి రాజీవ్‌రహదారి వెంట హైదరాబాద్‌కు వెళుతుండగా, నగరానికి యాభై కిలో మీటర్ల దూరం ఉందనగా వస్తుంది గౌరారం. మొదట్లో చిన్న చిన్న హోటల్‌లు మాత్రమే ఉన్న ఈ ప్రాంతంలో ఇటీవల ఫేమస్ రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు వెలిశాయి. సింగాయిపల్లి క్రాస్ రోడ్డు నుంచి ప్రారంభమైన రెస్టారెంట్లు వర్గల్ క్రాస్ రోడ్డు వరకు ఏర్పాటయ్యాయి. ఆరు జిల్లాలకు చెందిన వారు హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఇదే ప్రధాన దారి. సిద్దిపేటతో పాటుగా కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, మంచిర్యాల, రాజన్న సిరిసిల్లా జిల్లాల వాహనాలు ఎక్కువగా ఇక్కడి నుంచే వెళుతుంటాయి. నగరానికి చేరుకోకముందే ఆగాలనుకునే వారికి ఇది చక్కటి స్పాట్‌గా ఉండడంతో రోజురోజుకూ ఇక్కడికి వచ్చే జనం పెరుగుతున్నారు. ఉదయం అల్పాహారం, టీ తాగేందుకు వచ్చే వారితో ప్రారంభమయ్యే సందడి.. సాయంత్రమైదంటే చాలు కనీసం వాహనాలను నిలిపేందుకు కూడా స్థలం దొరకని పరిస్థితులుంటాయి. ఏ హోటల్ వద్ద చూసినా జాతరను తలపిస్తుంది. రాజీవ్ రహదారిపై ట్రాఫిక్‌కు అంతారాయం కలగకుండా ప్రతీ రెస్టారెంట్ వద్ద సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేసుకుంటున్నారు.



భలే రుచులు.. ఫేమస్ రెస్టారెంట్లు

ఇక్కడ జనానికి రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందజేస్తున్నారు. శాకాహారం, మాంసాహారంతో పాటు వివిధ రకాల పిండి వంటకాలను అందుబాటులో ఉంచుతున్నారు. వీటితో పాటుగా టిఫిన్‌లు, చాట్, ఐస్‌క్రీం, ఫాస్ట్‌ఫుడ్, చైనీస్, స్వీట్‌లు, బేకరీ పదార్థాలు, ఇరానీ చాయ్, పండ్ల రసాలు ఇలా అనేకం లభిస్తాయి. ఇక్కడి స్నాక్స్‌ను ప్రయాణికులు విపరీతంగా ఇష్టపడుతుంటారు. ఈ దారిలో వెళ్లే వారు తప్పకుండా వాహనాలను నిలుపుకుని ఇక్కడికి వచ్చి స్నాక్స్ తింటుంటారు. కార్న్, ఉల్లి సమోస, మక్క గారెలు, బోండా, పకోడి, మిర్చి, కట్ మిర్చి, ఆలు బజ్జి కోసం విపరీతంగా వస్తుంటారు. ఇటీవల కాలంలో ఇక్కడ ఫేమస్ రెస్టారెంట్లు సైతం వెలిశాయి. హైదరాబాద్ బిర్యానీకి ఫేమస్ అయిన ప్యారడైజ్, పసందైన రుచులతో నాన్ వెజ్ వంటకాలను అందిస్తున్న తెలుగు అరోమా రెస్టారెంట్ సైతం ఇక్కడికి చేరుకున్నాయి. అంతేగాదు ఇటీవల నగరంలో, పట్టణాల్లో వెలుస్తున్న థీమ్డ్ కాన్సెప్ట్ అయిన ట్రైన్ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేశారు. రాఘవేంద్ర హోటల్, దర్శిణి, 7హిల్స్, యతి హౌస్, స్వాగత్ రెస్టారెంట్, గోదావరి రుచులు, గ్రీన్ ఆరోమా, ఫాంస్టే రెస్టారెంట్ జనతా హోటల్, వీటితో పాటు అనేక రెస్టారెంట్లు, చాయ్ హోటళ్లకు, కేఫ్‌లకు గౌరారం కేరాఫ్ అయ్యింది. కొందరు రెస్టారెంట్ల నిర్వాహకులు అమ్మకాలు పెంచుకోవడం కోసం ఆఫర్లు ప్రకటిస్తున్నారు. మరికొందరు ఆర్టీసీ డ్రైవర్లకు స్నాక్స్‌ను ఫ్రీగా ఇస్తూ అమ్మకాలను పెంచుకుంటున్నారు. సుమారు వెయ్యి మంది హోటళ్లు, రెస్టారెంట్ల ద్వారా ఉపాధి పొందుతున్నారు.



స్నాక్స్ సెంటర్‌లో విక్రయిస్తున్న పదార్థాలు, ఒకే దగ్గర టీ, బేకరీ, సోడా దుకాణాలు

ప్రజలు ఇష్టపడే స్నాక్స్‌ని చేస్తాం



రోడ్డుపై ప్రయాణించే వారు ఎక్కువగా స్నాక్స్‌లో ఏది ఇష్టపడతారో అవే అందిస్తాం. మా వద్దకు సాయంత్రం సమయంలో జనం ఎక్కువగా వస్తారు. వారి కోసం మిర్చి, పునుగులు, కార్న్, ఉల్లి సమోస, మక్కగారెలను చేస్తుంటాం. దీంతో పాటు ఇరానీ చాయ్ లభిస్తుంది. ఆర్టీసీ బస్సు డ్రైవర్లకైతే ఉచితంగా స్నాక్ అందిస్తాం.

\- వెంకటేశ్, స్నాక్స్ సెంటర్ నిర్వాహకుడు

స్వీట్ పాన్‌లు ఎక్కువగా అమ్ముడుపోతాయి



జనంకు కావలసిన పాన్‌లు అందుబాటులో ఉంచుతాం. వారికి ఇష్టమైన పాన్‌ను చెబితే నిమిషంలో అందిస్తాం. నా వద్ద ఎక్కువగా స్వీట్ పాన్‌లు అమ్ముడుపోతాయి. పాన్‌తో పాటు రకరకాల బిస్కెట్ ప్యాకెట్లు, చాక్లెట్లు విక్రయిస్తాను.

\- అడెపు సంపత్, పాన్‌షాప్ నిర్వాహకుడు

తూప్రాన్‌లో యువకుడి హత్య

హల్దీవాగులో మృతదేహం



లభించిన మృతదేహం

తూప్రాన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని యువకుడిని దారుణంగా హత్య చేశారు. మెడకు తాడు, స్కార్ఫ్ కట్టి చంపేసినట్లు భావిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణ పరిధి ఆబోతుపల్లి శివారు గుండ్రెడ్డిపల్లి మార్గంలో హల్దీవాగులో సుమారు 30 ఏళ్లలోపు వయస్సు ఉన్న యువకుడి మృతదేహాన్ని గురువారం ఉదయం స్థానికులు గుర్తించారు. అతడి గొంతుకు ప్లాస్టిక్ తాడు, మహిళలు ధరించే స్కార్ఫ్ బిగించి ఉన్నాయి. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ రంగకృష్ణ, ఎస్ఐ శివానందం వచ్చి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎక్కడో హత్య చేసి, ఇక్కడ పడేసి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సంగారెడ్డి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిన సంఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామ పరిధిలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. సంగారెడ్డి రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లిలోని నందిని టిఫిన్ సెంటర్ వద్ద బిక్షాటన చేస్తూ తిరిగే ఒకరు ఈనెల 27న పడుకున్న స్థలంలోనే చనిపోయాడు. చనిపోయిన వ్యక్తి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్యలో ఉండి, సన్నగా చామన ఛాయ రంగు కలిగి నల్లని తల్ల వెంట్రుకలతో నాన్నాడు. ఒంటిపై బూడిదరంగు మాసిన ప్యాంటు, పసుపు పచ్చ రంగు నల్లని గీతల ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపచామని, ఎవరైనా గుర్తుపట్టిన వారు 87126 56746, 87126 56719 నంబర్లకు సమాచారం అందించాలని సంగారెడ్డి రూరల్ పోలీసులు తెలిపారు.

ఆటోలో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



బానోతు స్వప్నకు జన్మించిన బిడ్డ

ఝరాసంగం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గతుకుల రోడ్డుపై సమయానికి ఆస్పత్రికి చేరుకోలేక ఓ మహిళ రోడ్డుపై.. ఆటోలో ప్రసవించింది. ఆమెకు పండంటి మగ బిడ్డ పుట్టాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని పూర్యానాయక్‌తాండకు చెందిన భానోత్ స్వప్న గురువారం ఉదయం నుంచి పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు ఆమెను రెండో కాన్పుకోసం ఆటోలో ఝరాసంగం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్తున్నారు. ఝరాసంగం-పూర్యానాయక్‌తాండ రోడ్డు గుంతలతో కూడుకుని కంకర తేలి ఉండడంతో ఝరాసంగంకు సమయానికి వారు చేరుకోలేక పోయారు. దీంతో మార్గమద్యంలోనే ఆటోలో ఆమెకు పురిటినొప్పులు ఎక్కువ అయ్యాయి. దీంతో తోటి మహిళలు ఆటోలోనే ప్రసవం పోశారు. ఆమెకు పండంటి బిడ్డ జన్మించింది. తర్వాత ఆమెకు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై స్థానిక వైద్యాధికారులను సంప్రదించగ మహిళ ఆటోలో ప్రసవించింది వాస్తవమేనని, తల్లీబిడ్డా క్షేమంగానే ఉన్నారని తెలిపారు. గుంతలమయంగా మారిన రోడ్డుపై నిత్యం నరకం అనుభవిస్తున్నామని స్థానికులు తెలిపారు.

వెంకటాపూర్ కుంటలో ఆలయ హుండీలు

రెండింటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు



కుంటలో పడేసిన హుండీలు

తూప్రాన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎక్కడో ఆలయంలో చోరీ చేసిన హుండీలను గుర్తు తెలియని వ్యక్తులు తీసుకువచ్చి తూప్రాన్ పట్టణ పరిధి వెంకటాపూర్(పిటీ) శివారులోని కుంటలో పడేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. శివ్వంపేట మండలానికి సరిహద్దులో ఉన్న తెట్టెకుంటలో రెండు ఆలయ హుండీలు నీటిలో తేలి ఉండటం స్థానికులు గుర్తించారు. తూప్రాన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి వాటిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎక్కడో ఆలయంలో చోరీ చేసి, వాటిని ఇక్కడ పడేసినట్లుగా అనుమానిస్తున్నారు. నాలుగు, ఐదు రోజులుగా నీళ్లలో పసుపుపచ్చగా కనిపించగా, కుంటలో నీరు తగ్గడంతో హుండీలు కనిపించాయని చెబుతున్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భారత రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పది

ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వెంకటయ్య

గజ్వేల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారతరాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి గురువారం ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందన్నారు. వారివెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయోద్దీన్, నాయకులు దేవీరవీందర్, మల్లేశం, బెండే మధు, నూనె కుమార్, ఎం.శ్రీనివాస్, నవాజ్‌మీరా, రాంచంద్రం, ఊడెం కృష్ణారెడ్డి, రాచర్ల నరేశ్, పనుగట్ల శ్రీనివాస్, మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, బొల్లారం ఎల్లయ్య, స్వామిచారి, యాదగిరి, తుమ్మ శ్రీనివాస్, చిప్పల యాదగిరి ఉన్నారు.

ట్రైనీ కలెక్టర్ల బృందం పర్యటన



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్లు

జహీరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలో గురువారం ట్రైనీ కలెక్టర్ల బృందం పర్యటించింది. పర్యటనలో భాగంగా వారు రంజోల్‌లోని నగరవాటికలో నాటిన చెట్లను చూసి వాటి వినియోగం గురించి మున్సిపల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి హోతి(కే) సమీపంలో డంప్ యార్డులో కొనసాగుతున్న చెత్త రిసైక్లింగ్ విధానాన్ని పరిశీలించారు. అందులో కంపోస్టు తయారీ, బయోమైనింగ్ ప్రాసెస్, డ్రైరిసోర్స్ కలెక్షన్ సెంటర్ తదితరాలను పరిశీలించారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మున్సిపాలిటీలో చేపట్టబోయే వివిధ రకాల కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్‌లు వికాస్, చేతన్, అధిదిల తోపాటు, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ కేసులో ఆరు నెలల జైలు

గజ్వేల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బైక్ చోరీ చేసిన కేసులో నిందితుడికి గజ్వేల్ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బి.ప్రియాంక ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు. మూడు నెలల క్రితం జరిగిన మోటార్ సైకిల్ దొంగతనం కేసులో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలం సూర్యనగర్‌కాలనీకి చెందిన శంకర్‌సింగ్(25)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ విషయమై ఛార్జీషీట్ దాఖలు చేయగా, విచారణ చేపట్టిన న్యాయమూర్తి నేరం రుజువైనందున నిందితుడికి ఆరు నెలల జైలుశిక్షను విధిస్తూ తీర్పును వెలువరించినట్లు ఇన్‌స్పెక్టర్ సైదా తెలిపారు. నిందితుడికి శిక్షపడడంలో కీలకపాత్ర పోషించిన అసిస్టెంట్ ప్రాసిక్యూటర్ శంకర్, ఏఎస్ఐ గోపాల్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్ సైదా, కోర్టు కానిస్టేబుల్ కుమార్‌లను సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ అభినందించడంతో పాటు రివార్డును అందజేయనున్నారని తెలిపారు.

ఆలయంలో చోరీ కేసులో రెండేళ్లు

గజ్వేల్ మండలం సింగాటం గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో చోరీ కేసులో నిందితులకు రెండేళ్ల కఠిన కారాగార శిక్షను విధిస్తూ గజ్వేల్ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బి. ప్రియాంక తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బోదాసు యాదగిరి(35), ధూళిమిట్ట మండల కేంద్రానికి చెంది అల్లెపు శేఖర్(19) ఆరు నెలల క్రితం గజ్వేల్ మండలం సింగాటం గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయంలో మూడు గ్రాముల ముక్కుపుడక దొంగలించుకుపోయారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసు విషయంలో ఛార్జీషీట్ దాఖలు చేయగా, విచారణ జరిపిన న్యాయమూర్తి ఇద్దరు నిందితులపై నేరం రుజువైనందున రెండేళ్ల కఠిన కారాగార శిక్షను విధిస్తూ తీర్పును వెలువరించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితులకు శిక్ష పడటానికి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్, ఏఎస్ఐ గోపాల్‌గౌడ్, గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా, కోర్టు కానిస్టేబుల్ కుమార్ కీలకపాత్ర పోషించినందుకు సీపీ డాక్టర్ బి. అనురాధ అభినందిస్తూ, రివార్డును అందజేయనున్నట్లు తెలిపారు.

ఉర్దూ మీడియం పోస్టులు భర్తీ చేయాలి

సంగారెడ్డి అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : ఉర్దూ మీడియంలో భర్తీ కానీ మిగిలిన ఖాళీ పోస్టులను మెరిట్ ప్రకారం భర్తీ చేయాలని కోరుతూ అభ్యర్థులు గురువారం హైదరాబాద్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌సాబేర్‌అలీ మాట్లాడుతూ 2024 డీఎస్సీలో ఉర్దూ మీడియంలో 1,183 పోస్టులు ప్రకటించగా.. అందులో కేవలం 517 పోస్టులు మాత్రమే భర్తీ చేశారన్నారు. రిజర్వేషన్ అభ్యర్థులు లేకపోవడంతో ఉర్దూ పోస్టులు భర్తీ కానీ నేపథ్యంలో అర్హత కలిగిన అభ్యర్థులతో మిగిలిన పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సాబేర్‌అలీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖలీల్, నస్రీన్, బషీర్, ఖాసపాషా, ఉర్దూ ట్రైనీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠును అరికట్టేలా..

- 'ఎల్‌సీడీసీ' పేరిట ఇంటింటికి ఆరోగ్యశాఖ
- డిసెంబరు 2 నుంచి 15 వరకు ఆశాల సర్వే
- సర్వే ద్వారా 'కుష్ఠు' అనుమానితుల గుర్తింపు
- వ్యాధి నిర్ధారణ కోసం పీహెచ్‌సీ డాక్టర్ల వద్దకు సిఫారసు
- కార్యాచరణ రూపొందించిన వైద్య ఆరోగ్య శాఖ



సంగారెడ్డిలో ఎల్‌సీడీసీ సర్వే నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు, అధికారులు(ఫైల్)



సంగారెడ్డి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చర్మంపై స్పర్శలేని మచ్చలు, ఇతర మచ్చలున్నాయా? అంటూ ఆశా కార్యకర్తలు ఇంటింటికి రానున్నారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ)పేరిట వైద్య ఆరోగ్యశాఖ సర్వే నిర్వహించనున్నది. డిసెంబరు 2 నుంచి 15వ తేదీవరకు ఆశావర్కర్లు సర్వే చేయనున్నారు. ఏటా చర్మ వ్యాధి బాధితులు పెరుగుతున్నారు. చర్మానికి, నరాలకు సోకి ఇబ్బంది పెట్టే ఈ కుష్ఠు చాప కింద నీరులా విస్తరించి భయాందోళనకు గురిచేస్తున్నది. దీనిని ఆదిలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. ఇదే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా ఎల్‌సీడీసీ పేరిట కుష్ఠు బాధితుల గుర్తింపు సర్వే చేయిస్తున్నారు.

సంగారెడ్డి జిల్లాలో 15,27,628 జనాభా

జిల్లాలో 15,27,628 మంది జనాభా ఉన్నారు. అందులో 14,80,938 మందిని సర్వే చేయగా 1,815 మంది కుష్ఠు అనుమానితులున్నట్లు గుర్తించగా, అందులో 16 మందికి కుష్ఠు వ్యాధి నిర్ధారణ అయినట్లు అధికారులు తెలిపారు. గతంలో చేసిన సర్వే మాదిరిగానే ఈసారి కూడా సర్వే నిర్వహించాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ కార్యాచరణ రూపొందించింది. ఇప్పటికే ఆశా కార్యకర్తలకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమావేశాలు నిర్వహించి సర్వే ఆదేశాలు జారీ చేశారు.

ఆశాలతో ఇంటింటి సర్వే

జిల్లాలోని పట్టణ, గ్రామాల్లోని ప్రతి ఇంటింటి ఆశా వర్కర్లు వెళ్లి సర్వే చేస్తారు. జిల్లాలోని 34 ఆరోగ్య కేంద్రాల పరిధుల్లో 934 మంది ఆశావర్కర్లు పనిచేస్తున్నారు. సర్వే చేసినందుకుగాను ప్రతి ఆశాకార్యకర్తకు ఒకరోజుకు రూ.75 చొప్పున చెల్లిస్తారు. ఎల్‌సీడీసీ సర్వేలో భాగంగా ప్రతి ఆశాకార్యకర్త ఒక్కోరోజు రూరల్ ఏరియాలో 20-25 ఇళ్లు, అర్బన్ ఏరియాల్లో 25-30 ఇళ్లను సర్వే చేస్తారు. శరీరంపై తెల్ల మచ్చలు, రాగి వర్ణపు మచ్చలు, స్పర్శలేని మచ్చలు, చర్మం రంగు మారడం, మొద్దుబారిపోవడం, స్పర్శ తెలియకపోవడం లాంటి సమస్యలుంటే ఆశాలు సర్వే ద్వారా వివరాలు నమోదు చేసుకుంటారు. వీరిని సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్తారు. అనుమానిత లక్షణాలున్న వారిని మరోసారి లెప్రసీ బృందం చేత పరీక్షలు చేయిస్తారు. వ్యాధి ఉన్నట్లు తేలితే ఎండీటీ డ్రగ్స్ లెప్రసీ చికిత్స ప్రారంభిస్తారు.

ఆదిలో గుర్తిస్తేనే మేలు

కుష్ఠు ప్రధానంగా మైకోబ్యాక్టీరియం లెప్రె అనే బ్యాక్టీరియా వల్లా సంక్రమిస్తుంది. కుష్ఠు ముఖ్యంగా నరాలకు, చర్మానికి సోకుతుంది. వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి మూడేళ్ల సమయం పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. వయసు, లింగ బేధం లేకుండా ఎవరికైనా ఈ వ్యాధి సోకవచ్చు. వంశ పారంపర్యంగా ఈ వ్యాధి సంక్రమించదు. శరీరంలో ఏ భాగంలోనైనా సోకవచ్చు. కుష్ఠు బాధితులు ఎండీటీ మందులు 6 నుంచి 12 నెలలు వాడితే పూర్తిగా నయమవుతుంది. వ్యాధి ప్రారంభ దశలో గుర్తించి సరైన చికిత్స చేయించుకుంటే అంగవైకల్యానికి దారితీయదు. వ్యాధిపై అవగాహన లేనివారు సరైన సమయంలో వైద్య చికిత్సలు చేయించుకోకపోవడంతో ఇది తీవ్ర రూపం దాల్చుతోంది.

కుష్ఠురహిత సమాజమే లక్ష్యం



జిల్లాలో వచ్చేనెల 2 నుంచి ఎల్‌సీడీసీ సర్వే పకడ్బందీగా నిర్వహిస్తాం. ఇప్పటికే మెడికల్ ఆఫీసర్లు, ఆశావర్కర్లకు శిక్షణ ఇచ్చాం. కుష్ఠు అనుమానితులను గుర్తించి వారందరికీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి సరైన చికిత్స అందిస్తాం. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందిస్తారు. సర్వేకు వచ్చే ఆశాలకు ప్రజలు సహకరించాలి. కుష్ఠు వ్యాధి నిర్మూలనకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. కుష్ఠు వ్యాధి రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

\- డాక్టర్ డాక్టర్ శశాంక్‌దేశ్‌పాండే, జిల్లా లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్, సంగారెడ్డి జిల్లా

పశువుల హాస్టల్ నిర్మాణం పూర్తయ్యేనా?

● మిట్టపల్లిలో అసంపూర్తిగానే.. ● అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ● పూర్తిచేసి వినియోగంలోకి తేవాలంటున్న గ్రామస్థులు

సిద్దిపేట అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పశువులకూ హాస్టల్ నిర్మించి వాటి బాగోగులు చూసుకుంటూ పశు సంపదకు దోహదపడాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం పశువుల హాస్టల్ నిర్మాణాలను చేపట్టింది. అందులో భాగంగానే సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లి సమీపంలో నిర్మిస్తున్న పశువుల హాస్టల్ అసంపూర్తిగానే ఆగిపోయింది. మిట్టపల్లిలో గత ప్రభుత్వ హయాంలో మూడు సంవత్సరాల క్రితం పనులు మొదలుపెట్టి 70శాతం పూర్తి చేసి, రెండు సంవత్సరాలుగా అసంపూర్తిగానే వదిలిపెట్టారు.

ఉమ్మడి నిధులతో పనులు

ఉపాధిహామీ పనుల కింద, బాలవికాస ఆధ్వర్యంలో సంయుక్తంగా ఈ హాస్టల్ నిర్మాణాన్ని చేపట్టారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి వచ్చిన నిధులతో సుమారు 70 శాతం పనులను పూర్తి చేశారు. బాలవికాస ఆధ్వర్యంలో జరగాల్సిన పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి. దీనికి కారణం నిర్మాణం జరుగుతున్న సమయంలోనే బాలవికాస సంస్థపై విచారణ జరగడంతో పనులు పెండింగ్‌లో పడినట్టు సమాచారం. సుమారు రెండెకరాల స్థలంలో మూడు కోట్ల వ్యయంతో హాస్టల్ నిర్మాణం చేపట్టారు. బాలవికాసం మళ్లీ నిధులు వెచ్చించి నిర్మాణం పూర్తి చేస్తుందా? అసంపూర్తిగానే ఉండిపోతుందా అని గ్రామస్థులు అంటున్నారు.


అసంపూర్తిగా ఉన్న పశువుల హాస్టల్ నిర్మాణం, ఇన్‌సెట్‌లో హాస్టల్‌లో పేక ముక్కలు

ఖాళీ మద్యం సీసాలు.. పేకముక్కలు

గ్రామానికి దూరంగా హాస్టల్ నిర్మాణం చేపట్టడం, షెడ్‌లు కూడా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. చుట్టూ ప్రహరీ నిర్మించకపోవడం, హాస్టల్‌కు తలుపులు, సెక్యూరిటీ లేకపోవడం కొందరికి అవకాశంగా మారింది. పేకాట, మద్యం సేవించడం ఇతరత్రా కార్యక్రమాలకు అది నిలయంగా మారిపోయింది. ప్రస్తుతం పశువుల హాస్టల్ వద్దకు వెళ్తే ఖాళీ మద్యం సీసాలు, పేకముక్కలు దర్శనమిస్తున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఉపయోగంలోకి తీసుకురావాలి

గ్రామ పరిధిలో నిర్మిస్తున్న పశువుల హాస్టల్ మూడు సంవత్సరాలుగా పూర్తి కాలేదు. ఇక్కడ ఎన్నో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో హాస్టల్ నిర్మించి ఉపయోగంలోకి తీసుకురావాలి.

\- రంజిత్, మిట్టపల్లి

నాణ్యమైన భోజనాన్ని అందించాలి: ఎంపీడీవో

మిరుదొడ్డి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో గణేష్‌రెడ్డి అన్నారు. మిరుదొడ్డి కస్తూర్బా గాంధీ పాఠశాలను గురువారం డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్, డాక్టర్ సమీనా సుల్తానాతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారివెంట పాఠశాల ఎస్‌వో స్వర్ణలత ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

మిరుదొడ్డి,నవంబరు28(ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డికి చెందిన నక్క లింగవ్వ ఇటీవల మృతిచెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అతడి కుటుంబసభ్యులను గురువారం పరామర్శించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ములుగు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమైలారం సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మరమ్మతుల దృష్ట్యా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

సత్యనారాయణస్వామి ఆలయ వార్షికోత్సవాలు


వర్గల్: సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో భక్తులు

వర్గల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలోని ఉప ఆలయమైన సత్యనారయణస్వామి ఆలయం వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సత్యనారాయణ స్వామికి పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణ దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే కార్తీక మాసం సందర్భంగా ఆలయ మండపంలో భక్తులతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ అన్నపూర్ణ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


రామరాజు చిత్రించిన శివలింగం

● చేర్యాల: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో చేపట్టిన కార్తీక దీపోత్సవంలో భాగంగా గురువారం మహాగణపతి ప్రార్థన, గణపతి సూక్తం, సరస్వతి సూక్తం, మహిషాసురమర్దిని స్తోత్ర పారాయణం చేశారు. అనంతరం దీపార్చన చేపట్టారు.

● గజ్వేల్ రూరల్: కార్తీకమాసం సందర్భంగా పంచదారను ఉపయోగించి గురువారం గజ్వేల్‌లో 10 అడుగుల పొడవుతో శివలింగం చిత్రాన్ని రామకోటి రామరాజు ఆవిష్కరించారు.

చేర్యాల ఉనికిని దెబ్బతీస్తున్నారు

● బీజేపీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు

చేర్యాల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పాలకులు చేర్యాల ప్రాంతాన్ని రాజకీయ స్వార్థప్రయోజనాలకు వినియోగించుకుంటూ ఉనికిని దెబ్బతీస్తున్నారని బీజేపీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు బూరుగు సురేశ్ ఆరోపించారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహావరణలో పోరుదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలముందు ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం డివిజన్ ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ప్రజలను తప్పుదోవపట్టించేందుకు కాంగ్రెస్ నేతలు బూటకు జేఏసీని సృష్టించారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తోకల ఉమా


పోరుదీక్షలో బీజేపీ నాయకులు

రాణి, పోతుగంటి రాందాస్, దండ్యాల లక్ష్మారెడ్డి, మన్నెసత్యవర్ధన్, కాశెట్టి పాండు, బూరుగోజు నాగరాజు, సంతోశ్‌కుమార్, ఇర్రి ఉమా, పుర్మ సంజీవరెడ్డి, భిక్షపతిరెడ్డి, కొట్టె చంద్రమౌళి, సనాది కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఏర్పాటుకు మార్గం చూపిన దీక్షాదివాస్

● బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్వరాష్ట్ర ఏర్పాటుకు దీక్షాదివాస్ మార్గం చూపిందని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'కేసీఆర్ చచ్చుడో.. తెలంగాణ వచ్చుడో' అనే నినాదంతో కేసీఆర్ దీక్షను చేపడితే కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి రాష్ట్రాన్ని ప్రకటించిందన్నారు. సిద్దిపేట పట్టణంలో నేడు నిర్వహించనున్న దీక్షా దివాస్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆయనవెంట మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఎంపీపీ ఫోరం మాజీ గౌరవాధ్యక్షుడు దేవీరవీందర్, మాజీ


విలేకరులతో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ జకీయోద్దీన్, నాయకులు బెండే మధు, నవాజ్‌మీరా, నూనె కుమార్, ఊడెం కృష్ణారెడ్డి, పనుగట్ల శ్రీనివాస్‌గౌడ్, జుబేర్, మంగమ్మ రాంచంద్రం, పాండుగౌడ్ ఉపేందర్‌రెడ్డి, మల్లేశం, జయమ్మ-అర్జున్‌గౌడ్, పాల రమేశ్ తదితరులున్నారు.

పిల్లల చదువుకు నడుం బిగించిన యోధుడు ఫూలే: డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి


కోహెడలో మహాత్మా జ్యోతిరావుఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

గజ్వేల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పిల్లల చదువుకు నడుం బిగించిన యోధుడు జ్యోతిరావుఫూలే అని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని రాజిరెడ్డిపల్లి పాఠశాల, పల్లెపహాడ్ పాఠశాలల్లో తొలి సామాజిక విప్లవకారుడు జ్యోతిరావుఫూలే 134వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో కుల, మత వ్యవస్థల మూలంగా విద్యకు, సంపదకు, అధికారానికి దూరమైన అణగారిన వర్గాలు, మహిళల హక్కుల కోసం పోరాటం నడిపిన తొలి సామాజిక విప్లవకారుడు అని కొనియాడారు. ఆయనవెంట డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు తదితరులు ఉన్నారు.

● కోహెడ: మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిరావుఫూలే వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, అంబేడ్కర్ సంఘం మాజీ అధ్యక్షుడు మంద మల్లేశం, పిడిశెట్టి రాజు, జయశంకర్, వేల్పుల వెంకటస్వామి, గోవిందు సురేష్, తేలు యాదగిరి, సంపత్, కృష్ణ, కుమార్, రవి, దేవేందర్, తుపాకుల రాజమౌళి, నారోజు రవీంద్రచారి, రాజు, కిషోర్, నరేష్, రాజయ్య, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి


శ్రీరాములపల్లి గ్రామంలో మాట్లాడుతున్న రాజేష్

కోహెడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దళితుల ఐక్యత కోసం డిసెంబరు 1న నిర్వహించే మాలల సింహగర్జనకు మాలలు భారీగా తరలిరావాలని రేంజర్ల రాజేష్ పిలుపునిచ్చారు. మండలంలోని శ్రీరాములపల్లిలో మాల మహానాడు నియోజకవర్గ కన్వీనర్ ఆరె కిశోర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర సభ్యులు మరాటి మణిదీప్, జిల్లా ఉపాధ్యక్షులు తలారి నరసయ్య, జాల శ్రీనివాస్, బోలుమల్ల ఎల్లయ్య, మైల తిరుపతి, బండెల రాజమౌళి, సాగర్, మరాటి శ్రీనివాస్, నీరటి కనకయ్య, గుమ్మడి సాయిశ్రీరామ్, స్వామి, మేకల శ్రీకాంత్, మామిడి స్వామి, సంపత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

దుబ్బాక ఆర్టీసీ బస్‌డిపోలో కార్తీక వనభోజనాలు

దుబ్బాక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక ఆర్టీసీ బస్‌డిపోలో సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కార్మికులు కార్తీక వనభోజనాలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ... కార్మికుల మధ్య సోదరభావం పెంపొందించడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో డిపో ఇన్‌చార్జు కనకలక్ష్మి, డిపో చీఫ్ ఇన్‌స్పెక్టర్ మహేశ్వరీ, లింగంగౌడ్, పోశయ్య తదితరులున్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు.. ఇద్దరికి గాయాలు

కొండపాక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆటోను కారు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో గురువారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ మల్లారం నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు తిమ్మారెడ్డిపల్లి శివారులో ఆటోను ఓవర్‌టేక్ చేయబోయి అదే ఆటోను ఢీ కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న అమృత, రవీందర్‌రెడ్డిలకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది మహేందర్, శ్రీనివాస్ గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేసి గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


ప్రమాదంలో ధ్వంసమైన కారు

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

● డీపీవో దేవకీదేవి

మిరుదొడ్డి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని డీపీవో దేవకీదేవి పేర్కొన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లిలో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. అలాగే పాఠశాల, ఆసుపత్రి, నర్సరీని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే తమదృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆమె వెంట ఎంపీవో జహీరొద్దిన్, పంచాయతీ కార్యదర్శి అశోక్, బాలాగౌడ్ తదితరులున్నారు.


మొక్కలు నాటుతున్న డీపీవో

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

● జిల్లా వ్యవసాయాధికారి రాధిక


అంకిరెడ్డిపల్లిలో రికార్డులను తనిఖీ చేస్తున్న రాధిక

రాయపోల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్ దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలని, అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి రాధిక హెచ్చరించారు. మండలంలోని అంకిరెడ్డిపల్లి, వడ్డెపల్లి, ఎల్కల్ గ్రామాల్లో గురువారం ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్స్‌ను పరిశీలించారు. స్టాక్ బోర్డు, ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి నరేష్ ఉన్నారు.

మొక్కలను సిద్ధంగా ఉంచాలి: ఎంపీడీవో


నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో రామ్మోహన్

దూళిమిట్ట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే వన మహోత్సవం నాటికి మొక్కలు సిద్ధంగా ఉంచాలని ఎంపీడీవో రామ్మోహన్ ఆదేశించారు. మండలకేంద్రంతో పాటు తోర్నాల, బెక్కల్ గ్రామాల్లోని నర్సరీలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2025 సంవత్సరానికి నర్సరీల ఏర్పాటు కోసం బ్యాగ్ ఫిల్లింగ్ చేసి విత్తనాలు వేసి ఉంచాలని కార్యదర్శులకు సూచించారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు ఉన్నారు.

'ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం'

జగదేవ్‌పూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయంకొత్త లభిస్తుందని మండల వ్యవసాయ అధికారి వసంతరావు అన్నారు. ఆయిల్‌పామ్ సాగు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సాగులో మెలకువలపై జగదేవ్‌పూర్‌లో గురువారం రైతులకు అవగాహన కల్పించారు.

రాష్ట్రస్థాయి 'చెకుముకి'కి ఇర్కోడు విద్యార్థులు

సిద్దిపేట రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి: సిద్దిపేటలో నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రవీందర్ గౌడ్ తెలిపారు. సిద్దపేట పట్టణంలో గురువారం చెకుముకి సైన్స్ సంబరాలు-2024 పోటీలు నిర్వహించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు ఆర్.సూర్యతేజ, డి.మైకేల్, పి.ఉదయ్‌లను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది.


విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

మల్లన్నను దర్శించుకున్న వేములవాడ ఆలయ ఈవో


మల్లన్న ఆలయంలో ఈవో వినోద్‌రెడ్డి

చేర్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామిని గురువారం వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ ఈవో వినోద్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ సురేందర్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్ స్వామి వారి ప్రసాదం, శేష వస్త్రం అందించారు.

రికార్డుల నిర్వహణలో లోపాలు.. కార్యదర్శిపై డీఎల్పీవో ఆగ్రహం

● తీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

సిద్దిపేట రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడంపై డీఎల్పీవో మల్లికార్జున్ రెడ్డి నారాయణరావుపేట పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణరావుపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీరాములు, ఎంపీవో శ్రీనివాసరావులతో కలిసి గురువారం గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ బ్యాలెన్స్ వివరాలు, ఖర్చులు, పన్నుల వసూలు, లైసెన్సుల ఫీజులు, జనరల్ ఫండ్, 15వ ఆర్థిక ప్రణాళిక నిధుల వినియోగంతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌లో బ్లీచింగ్ స్టాక్ లేకున్నా ఉన్నట్లు చూపించడంతో "నీ పనితీరు ఎలా ఉందో రికార్డుల నిర్వహణ చూస్తేనే తెలుస్తుంది" అని అసహనం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో మరోసారి రికార్డులు పరిశీలిస్తానని పని తీరు మార్చుకోకపోతే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్పీవో

కేజీబీవీ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

● యూటీఎఫ్ మిరుదొడ్డి మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు

మిరుదొడ్డి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని యూటీఎఫ్ మిరుదొడ్డి మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శి బద్దిరాజు, కృష్ణలు అన్నారు. మిరుదొడ్డిలో కస్తూర్బా గాంధీ పాఠశాలలో విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలను పెంచాలని కోరారు.


నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

మహాసభలను జయప్రదం చేయండి

● సీపీఎం నాయకులు

దూళిమిట్ట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1వ తేదిన గజ్వేల్ పట్టణంలో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలనీ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చొప్పరి రవికుమార్ పిలుపునిచ్చారు. దూళిమిట్ట, భైరాన్‌పల్లి, బెక్కల్, తోర్నాల, జాలపల్లి గ్రామాల్లో గురువారం హమాలీ కార్మికుల సమావేశాలు నిర్వహించి పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభలకు ప్రజలు, కార్మికులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దాసరి ప్రశాంత్, మండల కార్యదర్శి పోతుగంటి రాజు, జిల్లా నాయకులు తాడూరి భరత్, చొప్పరి ప్రసాద్,సత్యనారాయణ, రాజు, కనకయ్య పాల్గొన్నారు.


దూళిమిట్ట: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు


మద్దూరు: మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

● మద్దూరు: డిసెంబరు 1, 2వ తేదీల్లో గజ్వేల్ పట్టణంలో నిర్వహించే సీపీఎం మూడో మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం మద్దూరు మండల కార్యదర్శి ఎండీ షఫీ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి మహాసభల విజయవంతానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో గూడ రాజయ్య, దయ్యాల కనకయ్య, బాలి కరుణాకర్, నర్సింహులు, సుధాకర్ ఉన్నారు.

మట్టిపోసి వదిలేశారు!

● అసంపూర్తి రోడ్డుతో అవస్థలు
● భారీ వాహనాలతో కమ్మేస్తున్న దుమ్ము
● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


భారీ వాహనం కారణంగా లేచిన దుమ్ములో ఇబ్బందులు పడుతూ వెళ్తున్న ద్విచక్రవాహనదారులు

చిన్నకోడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నాలుగు లైన్‌ల రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా మండల కేంద్రంలోని వివేకానంద విగ్రహం సమీపం నుంచి గ్రామ శివారులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ వరకు సుమారు 1 కిలో మీటరు మేర కాంట్రాక్టర్ పాత బీటీ రోడ్డును తొలగించి మట్టి పోసి వదిలేశాడు. మట్టి పోసి నెలలు గడుస్తున్నా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో ఆ రోడ్డు గుండా భారీ వాహనాలు వెళ్తున్నప్పుడు దుమ్ము కమ్మేస్తుంది. దీంతో ద్విచక్ర వాహనదారులు, బావుల వద్దకు వెళ్లే రైతులతో పాటు రోడ్డు సమీపంలోని కాలనీవాసులు, దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దుమ్ము కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, రైతులు కోరుతున్నారు.

నినాదానికి ఊపిరి

-ఐదోపేజీ తరువాయి

మొత్తంగా నవంబరు 29 తెలంగాణ చరిత్రను మలుపు తిప్పిన రోజుగా భావిస్తూ, ఆ స్ఫూర్తిని స్మరిస్తూ బీఆర్ఎస్ గత 14ఏళ్ల నుంచి దీక్షా దివాస్‌ను జరుపుకుంటున్నారు. ఆ దీక్ష నేటితో 15 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో వేడుకలకు పార్టీ కార్యాలయాన్ని సిద్ధం చేశారు.

నేడు పలు కార్యక్రమాలు..

దీక్షా దివాస్ సందర్భంగా సిద్దిపేటలో శుక్రవారం పార్టీ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లో ఉదయం 9.30 గంటలకు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తారు. అనంతరం రంగాధంపల్లి అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ, కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం, నాటి ఉద్యమ ఫొటో ప్రదర్శన, వక్తల ప్రసంగాలు జరగనున్నాయి.